జనం నెత్తిన అధనపు భారం



- పెరిగిన వంట గ్యాస్ ధరలతో ఇక్కట్లు
- నియోజకవర్గవ్యాప్తంగా నెలకు 90వేల సిలిండర్ల వినియోగం
- నియోజకవర్గ వ్యాప్తంగా రూ.72.76 లక్షలు అదనపు భారం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వినియోగదారులు

తాడేపల్లి రూరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ వినియోగదారులపై మళ్లీ భారం మోపింది. ఎల్‌పీజీ గ్యాస్ సిలెండర్ ధర రూ. 50 మేర పెంచుతున్నట్లు చమురు సంస్థలు ప్రకటించగా, పెరిగిన గ్యాస్ ధరలు ఇప్పటికే అమలులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో 14.2 కేజీల గ్యాస్ సిలెండర్ ధర రూ. 840లు నుంచి రూ. 890లకు చేరింది. డెలివరీ బాయ్ ఛార్జీలు రూ. 30తో కలిపి వినియోగదారుడు రూ. 930 చెల్లించాల్సి ఉంది, ఆయిల్ కంపెనీల ధర పెంపుపై ప్రభుత్వం నియంత్రణ రద్దు చేయడంతో అంతర్జాతీయంగా ధరలు తగ్గినప్పటికీ పెట్రోల్, గ్యాస్ ఉత్పత్తుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రతి నెల వంటగ్యాస్‌పై క్రమం తప్పకుండా రూ.25 పెంచిన విషయం విధితమే. కొంతకాలం వ్యవధి అనంతరం తాజాగా రెట్టింపు ధర పెంచడం కొనుగోలుదారుల్ని కలవరానికి గురిచేస్తోంది. మోదీ ప్రభుత్వ తీరుపై వినియోగదారుల్లో అసహనం వ్యక్తమవుతోంది. ధరలను నియంత్రించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ధరలు తగ్గించాలంటూ వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు, నిరసనలు తెలియజేస్తున్నారు.

1,45,526 గ్యాస్ కనెక్షన్లు

మంగళగిరి నియోజకవర్గంలో మొత్తం 1,45,526 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. నెలకు సుమారు 90 వేల సిలిండర్లు వినియోగిస్తున్నట్లు అంచనా. ఆయిల్ కంపెనీలు ధరలు అమాంతంగా పెంచేస్తున్నాయని, వంటగ్యాస్ మరో రూ. 50 పెరగడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. వాణిజ్య సిలెండర్ ధర తమకు మోయలేని భారంగా తయారైందని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా గ్యాస్ ధర పెంచడంతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని సామాన్యులు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ధరా 'భారం'..

మంగళగిరి నియోజకవర్గ వ్యాప్తంగా పెరిగిన ధరతో రూ.72,76,300 అదనపు భారం పడుతుంది. 2019 ఏప్రిల్ నుంచి ధరలు పెరుగుతూ వస్తున్నాయి. అప్పుడు రూ. 734 ఉన్న గ్యాస్ ధర 2020 మార్చినాటికి రూ. 839, 2021 అక్టోబర్ నాటికి రూ. 930కి పెరిగింది. 2022లో మూడుసార్లు, 2023లో నాలుగుసార్లు, 2024లో ఆరుసార్లు చొప్పున ధరలు పెరిగాయి. ఎన్నికలకు ముందు స్వల్పంగా ధర తగ్గించిన కేంద్ర ప్రభుత్వం మరోసారి గుదిబండ మోపింది. తాజాగా పెంపుతో గ్యాస్ ధర రూ. 890కి చేరింది. మరోవైపు సివిల్ సప్లయ్ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో డెలివరీ చార్జీలు ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో విధంగా వసూలు చేస్తున్నారు. రూ. 30 నుంచి రూ. 60 వరకు వసూలు చేస్తున్నారు.

అవయవ దానంపై అవగాహన

ఆత్మకూరు(మంగళగిరి): అవయదానం చేయండి.. మరొకరికి పునర్జన్మ ప్రసాదించండి అని విద్యార్థులు తెలిపారు. నగర పరిధిలోని ఆత్మకూరులో మంగళవారం కేఎల్ యూనివర్సిటీ విద్యార్థులు అవయవదానంపై ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. అవయాలు విఫలమై మరణాలకు చేరువైన వారి ప్రాణాలు నిలిపి పునర్జన్మనిచ్చే గొప్ప మార్గం అవయదానమని, చనిపోయినా మరొకరి లో జీవించే వరాన్ని ప్రసాదించే అవయదానంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి వుండాలన్నారు. బ్రెయిన్ డెత్ అయితే కిడ్నీ, గుండె, కాలేయం, పాంక్రియాస్, పేగులు, సహజ మరణమైతే గుండె కవాటాలు, కార్నియా, రక్తనాళాలు, చర్మం వంటి కీలక అవయాల మార్పిడితో కొత్త జీవితాలను పొందవచ్చన్నారు. అవయవాలు లభించకపోవడంతో ఎందరో మరణిస్తున్నారన్నారు. ప్రభుత్వ వైద్యశాల, జీవన్ దాన్ కార్యక్రమంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ కేఆర్‌ఎస్ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ పి.శ్రీకాంత్ రెడ్డి, ఫీల్డ్ కో–ఆర్డినేటర్ పి.సురేష్, వలంటీర్లు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలుపై హర్షం

దుగ్గిరాల: ముస్లిం సమాజానికి తీవ్ర నష్టం కలిగించేవిధంగా ఉన్న వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సుప్రీం కోర్టులో పిటీషన్ దాఖలు చేయడంపై పార్టీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం దుగ్గిరాల ముర్తాజానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యం ముస్లింల సంక్షేమాన్ని ఆకాంక్షించే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముస్లిం మైనారిటీల హక్కులను హరించేలా ఉన్న ఈ చట్టాన్ని ఆదినుంచి వ్యతిరేకిస్తున్నారన్నారు. సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడంపై ముస్లింల సంక్షేమంపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధి మరోసారి రుజువైందన్నారు. ఆయనకు ముస్లిం సమాజం అంతా అండగా ఉంటామని తెలిపారు. వక్ఫ్ బిల్లు విషయంలో తెలుగు దేశం ద్వంద్వ విధానాలను అనుసరిస్తుందన్నారు. కేంద్రంలో భాగస్వామిగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు వక్ఫ్ బిల్లుకు మద్దతు ఇవ్వడం ద్వారా ముస్లింలపై వారి వైఖరి తేటతెల్లం అయ్యిందన్నారు. కార్యక్రమంలో షేక్ జిలాని, షేక్ సలీమ్ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

మంగళగిరి టౌన్: ఎన్నికలకు ముందు నారా లోకేష్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని మంగళగిరి పట్టణ సీపీఎం నాయకులు కోరారు. మంగళగిరి నగర పరిధిలోని సీపీఎం కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గంలోని ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకుని నివాసముంటున్న పేదలందరికీ ఇళ్లపట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్ ధరలను పెంచిందని, వెంటనే ఆ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలను పెంచబోమని చెప్పి అధికారంలోకి రావడంతోనే విద్యుత్ చార్జీలు కోట్ల రూపాయల భారం విద్యుత్ వినియోగదారులపై వేశారని ఆరోపించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు, జిల్లా కార్యదర్శి నేతాజీ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రవి, పట్టణ కార్యదర్శి జవహర్ లాల్, నాయకులు చెంగయ్య, దుర్గారావు, భాగ్యరాజు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

'పీ-4' కుటుంబాలను విచారించిన అధికారులు

తాడికొండ: పీ–4 బంగారు కుటుంబం ఎంపికలో భాగంగా తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు కలిసిన కుటుంబాలను మంగళవారం రెవెన్యూ అధికారులు కలిశారు. తహసీల్దార్ మెహర్ కుమార్ ఆధ్వర్యంలో సంకూరు ప్రసన్న, సంకూరు నవీన్, బూర్ల చిన్నమ్మాయి, సరిగల నీలిమ తదితరుల ఇంటికెళ్లి కలిసిన రెవెన్యూ అధికారుల బృందం వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా కుటుంబాలను విచారించి నివేదికను సిద్ధం చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. కుటుంబ ఆర్థిక, సామాజిక స్థితిగతులు విచారించి వారి అవసరాలు గుర్తించి రూపొందించిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్ఐ హనుమంతరావు, వీఆర్వోలు, సిబ్బంది ఉన్నారు.



సీఎం పరామర్శించిన కుటుంబాన్ని కలిసి విచారణ జరుపుతున్న రెవెన్యూ అధికారులు

నామ మాత్రపు రుసుముతో వృద్ధులకు ఆశ్రయం

మొవ్వా చిన్న బాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఎంవీ రామిరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: నామమాత్రపు రుసుం(నెలకు రూ.రెండు వేలు)తో అన్ని సదుపాయాలతో కూడిన వృద్ధాలయంలో ప్రవేశాలు కల్పించనున్నట్లు మొవ్వా చిన్న బాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఎంవీ రామిరెడ్డి తెలిపారు. అమరావతి రోడ్డులోని ట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామంలో తమ తండ్రి జ్ఞాపకార్థం స్థాపించిన వృద్ధాలయంలో ఆధునిక వసతులు, మౌలిక సౌకర్యాలతో 36 మందికి ప్రత్యేక గదులతోను, డార్మెటరీ ద్వారా మరో 30 మందికి అవకాశం అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. 60 ఏళ్లు దాటి తమ పనులు తాము చేసుకోగల వృద్ధులకు వసతి, భోజన సదుపాయాలతో పాటు 24 గంటలు ఆరోగ్య సేవలకు ఒక నర్స్‌ను అందుబాటులో ఉంచామన్నారు. స్త్రీ, పురుషులకు వేర్వేరుగా ప్రత్యేక సిబ్బందితో సేవలందిస్తున్నామని చెప్పారు. వినోదం కోసం టీవీలు, ఇండోర్ గేమ్స్, యోగా, ప్రత్యేక గ్రంథాలయం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. న్యూట్రిషనలిస్టు పర్యవేక్షణలో ఉదయం రుచి, సుచి గల అల్పాహారం, మధ్యాహ్నం టీ, స్నాక్స్, రెండు పూటలా భోజనం అందిస్తామని చెప్పారు. ఇతర వివరాలకు, ప్రవేశాలకు ట్రస్ట్ ప్రతినిధి మున్నంగి శ్రీనివాస రెడ్డిని 99595 89452 నంబర్లో సంప్రదించాలని సూచించారు.



పెదపరిమి గ్రామంలోని వృద్ధాలయం

19న ఫిరంగిపురంలో జాబ్‌మేళా

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సెయింట్ జేవియర్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో ఈనెల 19న దివీస్ కంపెనీ(హైదరాబాద్) ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్ మణిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి, ఐటీఐ, పాలిటెక్నిక్, బీఎస్సీ, బీటెక్, డీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఎమ్మెస్సీ పాసైనవారు అర్హులన్నారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటలవరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. అదేరోజు అభ్యర్థుల ఎంపిక నిర్ణయించి తెలియజేస్తారన్నారు. దూరప్రాంతాలనుంచి వచ్చేవారికి భోజన వసతి కల్పిస్తామన్నారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంటతీసుకురావాలని కోరారు. మరిన్ని వివరాలకు 784273 5467 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను గ్రామ టీడీపీ అధ్యక్షుడు కానుగోలు కోటేశ్వరరావు మంగళవారం అందజేశారు. కుంచనపల్లి గ్రామానికి చెందిన మద్దిరాల పార్వతికి రూ. 48,996లు, వెంకట రామనరేంద్రకు రూ.26,218 విలువైన చెక్కులను వారి నివాసాలకు వెళ్లి అందజేశామని తెలియజేశారు. టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

18న చార్వాక రామకృష్ణ సంస్మరణ సభ

నిడమర్రు(మంగళగిరి): నాస్తికమేళా రూపశిల్పి చార్వాకాశ్రమ వ్యవస్థాపకులు చార్వాక రామకృష్ణ 18వ సంస్మరణ సభ ఈ నెల 18వ తేదీన నిడమర్రు చార్వాక ఆశ్రమంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బి.సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతి తార్కిక భౌతికవాదంపై జరిగే చర్చలో రాష్ట్ర విద్యా పరిరక్షణ కమిటీ కన్వీనర్ రమేష్ పట్నాయక్‌తో పాటు పలువురు వక్తలు, నాస్తిక సమాజం, పౌరహక్కుల సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు.

పేకాట శిబిరాలపై పోలీసుల దాడి

మంగళగిరి టౌన్: మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుసగా రెండు రోజులు పేకాట శిబిరాలపై రూరల్ పోలీసులు దాడులు నిర్వహించారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలప్రకారం సోమవారం రూరల్ పరిధిలోని ఎయిమ్స్ రోడ్‌లో కొండపై పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 3070లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట్ తెలిపారు. అదేవిధంగా మంగళవారం రూరల్ పరిధిలోని ఆత్మకూరు వడ్డెరపాలెంలో పేకాట శిబిరంపై దాడిచేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్దనుంచి రూ. 19500/- నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చిన్నారులకు కాస్మోటిక్ వస్తువులు పంపిణీ

తెనాలిటౌన్: పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చి ఆరోగ్యవంతైన జీవితం గడపాలని తెనాలి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక స్వదార్ హోంలోని అనాథలకు అవసరమైన కాస్మోటిక్, నిత్యావసర వస్తువులు పంపిణీ నిర్వహించారు. కొల్లి హర్షవర్ధన్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన భార్య సునీత ఈ సేవా కార్యక్రమం చేపట్టారు.

500 గ్రాముల గంజాయి పట్టివేత

మంగళగిరి రూరల్ పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు

మంగళగిరి టౌన్: మంగళగిరి రూరల్ పరిధిలో గంజాయి కలిగి వున్న ముగ్గురు వ్యక్తులను రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. మంగళగిరి కాజ టోల్‌గేటు వైపుగా కారులో ముగ్గురు వ్యక్తులు గంజాయితో వస్తున్నట్లు ఈగల్ టీమ్‌కు సమాచారం అందడంతో మంగళవారం టోల్‌గేటు వద్ద ఈగల్‌టీమ్ పోలీసులు పహారా కాశారు. మధ్యాహ్న సమయంలో కారులో వస్తున్న ముగ్గురు వ్యక్తులను ఈగల్‌టీమ్ అదుపులోకి తీసుకున్నారు. కారును తనిఖీ చేయగా సుమారు 500 గ్రాములు గంజాయి ఉందని, ఆ గంజాయి కొత్తరకం హైడ్రో గంజాయి మాదకద్రవ్యంగా ఈగల్‌టీమ్ పోలీసులు అనుమానం వ్యక్తం చేసినట్లు సమాచారం. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను కొత్తరకం గంజాయిని, మంగళగిరి రూరల్ సర్కిల్ కార్యాలయానికి తరలించినట్లు విశ్వసనీయ సమాచారం. బెంగళూరు నుంచి విశాఖపట్నంకు తీసుకువెళుతున్నట్లు ఈగల్‌టీమ్ ప్రాథమిక విచారణలో తేలిందని, రూరల్ పోలీసులు ముగ్గురు వ్యక్తులను విచారిస్తున్నట్లు తెలియవచ్చింది.

ముగిసిన ఎస్ఆర్ఎం ఉద్యోగుల క్రీడా పోటీలు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వీసీ మనోజ్ అరోరా



త్రో బాల్ పోటీలలో విజేతగా నిలిచిన మహిళా ఉద్యోగుల జట్టు

నీరుకొండ(మంగళగిరి): మండలంలోని నీరుకొండ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరుగుతున్న ఉద్యోగుల క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. ముగింపు సభలో విజేతలకు మెమొంటోలు, ట్రోఫీలను అందజేశారు. ఈ నెల 1 వ తేదీన ప్రారంభమైన పోటీలలో ఉద్యోగులు ఉల్లాసంగా పాల్గొనడం అభినందనీయమని వీసీ మనోజ్ కుమార్ అరోరా కొనియాడారు. యూనివర్సిటీకి చెందిన మానవ వనరులు, స్పోర్ట్స్ విభాగాల ఆధ్వర్యంలో ఉద్యోగులకు క్రికెట్, త్రోబాల్, క్యారమ్స్, చెస్, బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. యూనివర్సిటీకి చెందిన 340 మంది ఉద్యోగులు ఉత్సాహంగా క్రీడలలో పాల్గొన్నారని తెలిపారు. క్రికెట్ పోటీలలో సీఎస్ఈ ప్రొఫెసర్స్ జట్టు విజేతగా నిలిచింది. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా ఉదయరాజ్, బెస్ట్ బౌలర్‌గా హెచ్ఆర్ అన్వేష్, బెస్ట్ ఫీల్డర్‌గా డాక్టర్ రంజిత్ తాపా, ఓవరల్ ఛాంపియన్‌షిప్ ఉదయరాజ్ దక్కించుకున్నారు. మహిళల విభాగంలో ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను వేదశ్రీ, మోని కైవసం చేసుకున్నారు. త్రోబాల్ పోటీలలో అడ్మిన్ టీమ్ విజేతగా నిలిచింది. క్యారమ్స్‌లో కె.శ్రీనివాసరావు, నవ్య కళలు, రోప్ స్కిప్పింగ్‌లో రేణుకబాబు, రత్నప్రభ, బ్యాడ్మింటన్‌లో ఉదయరాజులు విజేతలుగా నిలిచారు. విజేతలకు వీసీ మనోజ్ కుమార్ అరోరా, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్, డీన్ డాక్టర్ సి.బామిలు బహుమతులు ప్రదానం చేశారు. పోటీలను స్పోర్ట్స్ ఆఫీసర్ శ్రీపతి, అసిస్టెంట్ డైరెక్టర్ సుస్మిత, కోచ్ వంశీలు పర్యవేక్షించారు.

వెంకటరత్నం సేవలు ఎనలేనివి

ఫిరంగిపురం: సీపీఎం సీనియర్ నాయకుడు రావిపాటి వెంకటరత్నం పార్టీకి చేసిన సేవలు ఎనలేనివని సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి పాశం రామారావు అన్నారు. సోమవారం రాత్రి మృతిచెందిన సీపీఎం సీనియర్ నాయకుడు డాక్టర్ రావిపాటి వెంకటరత్నం సంతాపసభ మంగళవారం నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యంలో ఎంతో ప్రతిభచూపి ప్రజలకు వైద్య సేవలు అందించారన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో పార్టీలో చేరి మండల కార్యదర్శిగా, సత్తెనపల్లి తాలూకా కమిటీ మాజీ సభ్యుడిగా సేవలు అందించాడని చెప్పారు. ప్రజాసమస్యల పరిష్కారానికి తనవంతుగా ఎన్నో సేవలు అందించారన్నారు. అనంతరం వెంకటరత్నం చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలకార్యదర్శి మస్తాన్‌వలి, జిల్లా నాయకులు ఈమని అప్పారావు, బైరగాని శ్రీనివాసరావు, జి.విజయకుమార్, గద్దె చలమయ్య, ఎ.రాధాకృష్ణ, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, ఎస్.ఆంజనేయులు నాయక్, రవి బాబు, జి.బాలకృష్ణ పాల్గొన్నారు.

'ఆయుష్మాన్' ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మంగళగిరి టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ / కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.నిరంజన్, కార్యదర్శి సందీప్, కో–ఆర్డినేటర్ వినోద్‌కుమార్ కోరారు. మంగళగిరి నగర పరిధిలోని ఆటోనగర్‌లో వున్న ఏపీఐఐసీ కార్యాలయం వద్ద ఏపీఎంసీఏ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. హెల్త్ వెల్‌నెస్ సెంటర్ సెల్ నోడల్ ఆఫీసర్ శ్యామల, ప్రోగ్రామ్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యంకు వారి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌లో పనిచేస్తున్న మాకు ఉన్న సమస్యలు చెప్పుకోవడానికి మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారులను కలిశామని అన్నారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం ఉద్యోగ సవరణ జరగాలని కోరారు. కమ్యూనిటీ ఆఫీసర్లుగా ఆరు సంవత్సరాల తరువాత రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 2019 నుంచి గ్రామీణ ప్రాంతాల్లోని ఆయుష్మాన్ ఆరోగ్యమందిర కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న తాము గత రెండు సంవత్సరాలుగా జీతాల విషయంలో తీవ్ర నిరాశ ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మమత, రాజీవ్, నంధ్యాల జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షుడు గణేష్‌కుమార్, ఇతర జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

క్లాప్ ఆటోడ్రైవర్లకు వేతనాలు ఇవ్వాలి

మంగళగిరి టౌన్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడం దారుణమని, వెంటనే వేతనాలు చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళగిరి నగర పరిధిలోని ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట గత 9 రోజులుగా చేస్తున్న సమ్మె మంగళవారం 10వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా కార్యాలయం గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ ఇన్ని రోజులుగా క్లాప్ ఆటో డ్రైవర్లు సమ్మె చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ స్పందించకపోవడం దారుణమని, ఇప్పటికైనా ఆయన స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. జీతాలు చెల్లించని పక్షంలో కోర్టుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. కనీస వేతనం నెలకు రూ. 24500లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంటీఎంసీ కమిషనర్ ఆలీం బాషాకు కార్మిక సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా నాయకులు చెంగయ్య, వీవీ జవహర్‌లాల్, పట్టణ నాయకులు బాలాజీ, క్లాప్ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఎం.రవి, కృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్ ఆలీం బాషాకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

మతోన్మాదం అరికట్టడానికి కృషి చేయాలి

క్రిష్టియన్ రైట్స్ అధ్యక్షుడు జాన్‌బాబు

తెనాలిటౌన్: బ్యూలా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పాస్టర్ల సమావేశం మంగళవారం రూరల్ మండలంలోని కఠెవరం గ్రామంలో నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మతసామరస్యం, ప్రజల మధ్య శాంతి, సోదర భావం విరాజిల్లాలని క్రైస్తవ పెద్దలు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో క్రిష్టియన్ రైట్స్ అధ్యక్షుడు జాన్‌బాబు పాల్గొని మాట్లాడారు. మతోన్మాదం ఏ మతంలో ఉన్నా, ఏ రూపంలో ఉన్న కూకటి వేళ్లతో పెకిలించాలని పిలుపునిచ్చారు. కొందరూ వ్యక్తులు ఇప్పటికీ బైబిల్‌పై బురదజల్లుతున్నారని ఆరోపించారు. క్రైస్తవ మతాన్ని దూషిస్తే ఊరుకోవద్దని అన్నారు. క్రైస్తవులపై దాడులు జరిగితే సహించబోమని హెచ్చరించారు. ప్రభుత్వం వారుగాని, పోలీసు వారుగాని పక్షపాత ధోరణి లేకుండా ప్రజలందరినీ సమాన దృష్టితో చూడాలని కోరారు. అనంతరం ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో బిషప్ సుధీర్‌కుమార్, రెవరెండ్ ప్రభుదాసు, రెవరెండ్ భానుప్రసాద్, పాస్టర్లు అబ్రహం, ఆనంద్ కుమార్, రమేష్, బాబురావు, పలువురు దైవసేవకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌బాబు

క్లుప్తంగా

ముగిసిన ఇంటర్న్‌షిప్ తరగతులు



దుగ్గిరాల: వృత్తి విద్యతో పాటు సంబంధిత కోర్సుల్లో 12 రోజులపాటు స్థానిక రేవేంద్రపాడు జడ్పీ హైస్కూల్‌లో జరిగిన శిక్షణా తరగతులు మంగళవారం ముగిసాయి. ఈనెల 3వ తేదీ నుంచి 15 వరకు సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో తరగతులు నిర్వహించారు. హైస్కూల్ హెచ్‌ఎం కె.ఆంటోని రాజ్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ పై శిక్షణ వల్ల విద్యార్థులకు స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయని, కోర్సు నేర్చుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్ అలాగే ఇంటర్న్‌షిప్ నగదు ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సహించిందన్నారు. ప్రోగ్రాం టీచర్ పి. జాన్సీని అభినందించారు. సీనియర్ ఎలక్ట్రీషియన్ కె.శంకర్ శిక్షణ అందించారు.

రీ సర్వే గ్రామసభ అవగాహన ర్యాలీ



దుగ్గిరాల: రీ సర్వే ప్రాజెక్ట్ లో భాగంగా మండలకేంద్రంలోని దుగ్గిరాల గ్రామంలో మండల అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మందుగా పంచాయతీ కార్యాలయం నుంచి శివాలయం కూడలి వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దార్ ఐ.సునీత మాట్లాడుతూ ప్రజలు తమ గ్రామాలలో ప్రభుత్వం చేపట్టనున్న భూరీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు, పంచాయతీ ఈఓ వివేకానంద్, అధికారులు, పాల్గొన్నారు.

స్వచ్ఛ మంగళగిరికి సహకరించాలి

నగర కమిషనర్ ఆలీంబాషా



పెదవడ్లపూడి(మంగళగిరి): స్వచ్ఛ మంగళగిరికి ప్రజలంతా సహకరించి నగరం పరిశుభ్రతలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేలా కృషి చేయాలని మంగళగిరి–తాడేపల్లి నగర పాలక సంస్థ కమిషనర్ ఆలీంబాషా తెలిపారు. మంగళవారం నగర పరిధిలోని పెదవడ్లపూడిలో స్వచ్ఛ మంగళగిరి నిర్వహించి చీపుర్లతో వీధులు శుభ్రపరచి, ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ జువ్వాది కిరణ్ చందు, అడిషనల్ కమిషనర్ శంకుతల, డిప్యూటి కమిషనర్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలతో పట్టణంలో నిరంతర నిఘా



మంగళగిరి టౌన్: నేరాల నియంత్రణే లక్ష్యంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విజువల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంగళగిరి సీఐ వినోద్‌కుమార్ తెలిపారు. మంగళగిరి నగర పరిధిలోని మెయిన్‌బజార్‌లో మంగళవారం విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకాలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుతం జరిగే నేరాలపై విజిబుల్ పోలీసింగ్‌లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ అవగాహన కల్పిస్తున్నామన్నారు. క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

మంగళగిరి టౌన్: జాతీయ అగ్నిమాపక దినోత్సవం నేపథ్యంలో మంగళగిరి అగ్నిమాపక కేంద్రంలో మంగళవారం వారోత్సవాలను ప్రారంభించారు. మంగళగిరి ఫైర్ స్టేషన్ నుంచి గౌతమ బుద్ధ రోడ్ ఆటోనగర్ మీదుగా ఫైర్ సేఫ్టీ ప్రదర్శన నిర్వహిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా జనసముదాయం కలిగిన ప్రాంతాల్లో ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నామని, రైల్వేస్టేషన్, బస్టాండ్, సినిమా థియేటర్, అపార్ట్‌మెంట్ తదితర ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫైర్ స్టేషన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.